క్లుప్తంగా

నెల రోజులకు చేరిన దీక్ష

భైంసాటౌన్: ముధోల్ మండలం రాళ్ల బోరిగాంలో బుద్ధ విగ్రహం ఏర్పాటు చేయాలని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 30వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విగ్రహ పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సభ్యులు దేవిదాస్ హస్తే, లక్ష్మణ్, రాజారాం, గిరిధర్ జంగ్మె, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు తనిఖీ

నర్సాపూర్ (జి): నర్సాపూర్ (జి) గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ఆడిట్ విభాగం సీనియర్ ఆడిటర్లు వెంకన్న, జుబేర్ రికార్డులను తనిఖీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ ఆదాయ, వ్యయాల రికార్డులను పరిశీలించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీకి విడుదల చేసిన నిధులు, ఆదాయ, వ్యయాలు, జమ వివరాలపై ఆడిటింగ్ నిర్వహించారు. ఇంటి పన్నులు వసూలుపై వివరాలు సేకరించారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి రాథోడ్ కైలాస్ పాల్గొన్నారు.

ఎఫ్‌డీవోగా రేవంత్‌చంద్ర

ఖానాపూర్: అడవుల సంరక్షణకు కృషి చేస్తానని ఖానాపూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర అన్నారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అడవులు నరికితే 9390170774 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కంచి ఉత్తరాధికారి తల్లిదండ్రుల పూజలు



ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

బాసర: శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారి సత్య చంద్ర శేఖరేంద్ర సరస్వతి తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పూర్వాశ్రమబ్రహ్మ దుడ్డు ధన్వంతరి–మంగాదేవి దంపతులు మంగళవారం పూజలు చేశారు. ముందుగా ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్, ఆలయ వైదిక బృందం స్వాగతం పలికారు. వీరి కుమారుడు బాసర ఆలయంలో రుగ్వేద పారాయణంలో విధులు నిర్వర్తించి ఇటీవల కంచి పీఠం ఉత్తరాధికారిగా నియమితులయ్యారు.

‘దళారుల ప్రమేయం వద్దు’

భైంసాటౌన్: రైతులకు సాగు రుణాల మంజూరులో దళారులను ప్రోత్సహించవద్దని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు కోరారు. మంగళవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ అర్పిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు సాప పండరి, అడెల్లి సాయికిరణ్ తదితరులున్నారు.

ప్రశ్నిస్తే కేసులా?



పోలీస్‌స్టేషన్ వద్ద దిలీప్, నాయకులు

కడెం: ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడతారా అని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి కొనతం దిలీప్ అన్నారు. కంచె గచ్చిబౌలి విషయంలో కడెం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు నిమిత్తం మంగళవారం లీగల్ టీంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, బాపురావు, నరేశ్, రాజేశ్వర్, మల్లేశ్, సాబీర్, మహిపాల్, హసీబ్ ఉన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో సీట్ల భర్తీ

నిర్మల్ రూరల్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లు మంగళవారం లాటరీ పద్ధతిన భర్తీ చేసినట్లు డీటీడీవో అంబాజీ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. 3వ తరగతిలో 13 సీట్లు, 5వ తరగతిలో 6, 8వ తరగతిలో 6 సీట్లను భర్తీ చేశారు.

కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలి

లక్ష్మణచాంద: అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సీడీపీవో నాగమణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారం, పీచర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్‌లో కూరగాయల విత్తనాలు నాటారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు వివరాలను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు పోషకాహారంపై పలు సూచనలు చేశారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, టీచర్లు పాల్గొన్నారు.

చుట్టుకున్న నిర్లక్ష్యం..



లోకేశ్వరం మ్యాక్స్ కార్యాలయం ఎదుట ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితి



లోకేశ్వరంలో రాంచందర్‌రావు ఇంటి వద్ద..



లోకేశ్వరం ఓహెచ్‌ఎస్ ట్యాంకు పక్కన..

లోకేశ్వరం: మండలకేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగల చుట్టూ పచ్చని తీగలు అల్లుకొని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. దీంతో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మ్యాక్స్ కార్యాలయం ముందు నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సిబ్బంది తీసుకెళ్లకపోవడంతో తుప్పు పడుతోంది. దాని చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రాంచందర్‌రావు ఇంటి వద్ద స్తంభం చుట్టూ, ఓహెచ్‌ఎస్ ట్యాంకు ఎదుట విద్యుత్ తీగలకు తగిలేలా పిచ్చిమొక్కలు ఉన్నాయి. ప్రమాదం జరగకముందే అధికారులు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

నీటి కోసం జనం గోస



పబ్లిక్ నల్లా వద్ద నీటి కోసం గుమిగూడిన జనం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు నీరు అందించే మోటారు కాలిపోయింది. దీంతో ఐదురోజులుగా 4, 5, 6, 7 వార్డుల్లో ఇంటింటికీ నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆయా వార్డుల ప్రజలు పబ్లిక్ నల్లాలు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మోటార్‌కు మరమ్మతులు చేయించి నీటి సమస్య తీర్చాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.



బిందెలు పెట్టి నిరసన తెలుపుతున్న స్థానికులు

బాసర: బోరు మోటారు కాలిపోవడంతో మండలకేంద్రంలోని బోయగల్లీలోని 30 ఇళ్లకు నాలుగురోజులుగా నీరు సరఫరా కావడం లేదు. స్నానాలు చేసేందుకు, ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మోటారుకు మరమ్మతులు చేయించి తమ కాలనీకి నీటిని సరఫరా చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రైతుభరోసా సంబురాలు



లక్ష్మణచాందలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ఖానాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సోన్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కుభీర్‌లో సీఎం ప్రసంగం వీక్షిస్తున్న రైతులు

నర్సాపూర్(జి): అన్నదాతలకుఖరీఫ్ కాలానికి సంబంధించిరైతుభరోసా నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, కొండ్ర రమేశ్, రైతులు తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద కాంగ్రెస్ నేతలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీసీసీబీ వైస్‌చైర్మన్ రఘునందన్‌రెడ్డి, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ నాయకులు పాల్గొన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగాన్ని రైతులు వీక్షించారు.

సారంగపూర్: మండలకేంద్రంలో నిర్వహించిన రైతుభరోసా సంబురాల్లో ఏఎంసీ చైర్మెన అబ్దుల్ హాదీ, అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, పోతారెడ్డి, సత్యపాల్ రెడ్డి, ముత్యంరెడ్డి, రాజ్‌మహ్మద్ ఉన్నారు.

కుంటాల: కుంటాల రైతువేదిక వద్ద కాంగ్రెస్ శ్రేణులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, జుట్టు లక్ష్మణ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద, వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద రైతుభరోసా సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం ప్రసంగం తిలకించారు. ఏవో సారిక, ఎంపీవో మోహన్ సింగ్, మార్కెట్ చైర్మన్ కల్యాణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బషీర్, బాబు, సందీప్, నర్సయ్య, ఏఈవోలు చరణ్, జగదీశ్ ఉన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద నిర్వహించిన రైతుభరోసా సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్, గంగారెడ్డి ఉన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంతోపాటు మన్మద్ గ్రామంలో రైతుభరోసా సంబురాలు నిర్వహించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, ఏవో గిరిరాజ్, కాంగ్రెస్ మండల కన్వీనర్ సుదర్శన్ తదితరులున్నారు.

మామడ: మండలకేంద్రంలో నిర్వహించిన రైతుభరోసా సంబురాల్లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, సంతోష్, రఫీ, గంగారెడ్డి, బాపయ్య, నర్సారెడ్డి, లింగన్న, వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నక్కల మధుకర్‌రెడ్డి, మొహినొద్దీన్, అంబేకర్ ప్రసాద్, రాంరెడ్డి, లింగన్న, ప్రేమ్, నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

కడెం: మండలకేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సతీశ్‌రెడ్డి, వాజిద్‌ఖాన్, సంతోశ్‌రెడ్డి, రమేశ్, సలీం, బబ్లూ, రాజు ఉన్నారు.

ఖానాపూర్: ఖానాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణచౌక్‌లో సీఎం, మంత్రి తుమ్మల, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కృష్ణారావు, ఎమ్మెల్యే బొజ్జు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, ఏఎంసీ వైస్‌చైర్మెన్ మాజిద్ ,గంగాధర్, వెంకాగౌడ్, శ్రీనివాస్, రాజన్న, తదితరులు ఉన్నారు.

‘ప్రభుత్వ భూమి లేదనడం సరికాదు’

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో 110 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో లేదని ఎమ్మెల్యే బొజ్జు అనడం సరికాదని ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, కో కన్వీనర్లు ఆకుల శ్రీనివాస్, బీసీ రాజన్న, కొండాడి గంగారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సాధన సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 110 ఎకరాలకు బదులు 76 ఎకరాలు మాత్రమే ఉందని ఎమ్మెల్యే పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. మిగతా భూమి ఎటు వెళ్లిందో అధికారులతో సర్వే చేయించి ప్రజలకు తెలుపాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ భూమి కేటాయింపుల సమాచారం ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. కాశవేని ప్రణయ్, ఎనగందుల నారాయణ, ఉపేందర్, తోట సుమిత్, సందుపట్ల శ్రావణ్, సందీప్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

తీగజాతి కూరగాయల సాగుతో లాభాలు

మామడ: తీగజాతి కూరగాయల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ డివిజన్ అధికారి మౌనిక అన్నారు. మంగళవారం మండలంలోని చందారం గ్రామంలో తీగజాతి కూరగాయల సాగును పరిశీలించారు. దొండ, కాకర, సోరసాగుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని.. రైతులు ముందుకు రావాలని అన్నారు. ఉద్యానశాఖ 50శాతం రాయితీని అందిస్తుందన్నారు. దొండ సాగు చేస్తున్న రైతులు వరుణ, శివారెడ్డిలకు పలు సూచనలు చేశారు. ఉద్యానశాఖ విస్తీర్ణ అధికారి దేవన్న ఉన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత

మామడ: మండలంలోని మామడ, కొరిటికల్ గ్రామాల్లో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. డ్రగ్స్ నిషేధం, బాల కార్మికులకు విముక్తి, బాల్యవివాహాలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గీతాశ్రమం సందర్శన

లక్ష్మణచాంద: హైదరాబాద్ జడ్చర్ల బాలేశ్వర మాత ఆశ్రమం నుంచి వచ్చిన అంబికేశ చైతన్య మహరాజ్ మంగళవారం మండలంలోని మునిపెల్లిలో గీతాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు ఉపదేశం చేశారు. జీవన విధానాన్ని బోధించే భగవద్గీత గ్రంథాన్ని ప్రతిఒక్కరూ చదవాలని సూచించారు. కార్యక్రమంలో స్వామీజీ అర్జున్‌రెడ్డి, గ్రామస్తులు కమల్‌కోట వెంకట్ రెడ్డి, భోజవ్వ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో మున్నూరు కాపు సంఘ కార్యవర్గాన్ని మంగళవారం ఆ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడిగా కంబోలి చిన్నన్న, కోశాధికారిగా ఎగ్గం నర్సింలు, ఉపాధ్యక్షుడిగా కూన శంకర్, సభ్యులుగా నాలం మహేందర్, నిమ్మల మహేశ్, బయటి ప్రవీణ్, సాంగి రాజేశ్వర్ ఎన్నికయ్యారు.

సన్మానం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం పలువురు నూతన చైర్మన్లను సన్మానించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డిలను డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన రెడ్డి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

లక్ష్మణచాంద: ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో అమీర్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం డ్రైడేలో భాగంగా ఆయన మండలకేంద్రంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పాత టైర్లు, కుండీల్లో నిల్వనీటిని పారబోయించారు. పార్‌పెల్లిలో నిర్వహించిన డ్రైడేలో ఆరోగ్య సమన్వయకర్త శివకృష్ణ పాల్గొన్నారు. పంచాయతి కార్యదర్శి రాకేశ్, సిబ్బంది అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలను పకడ్బందీగా చేపట్టాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పకడ్బందీగా చేపట్టాలని గ్రామ కార్యదర్శి భోజన్న అన్నారు. మండలంలోని హద్గాం గ్రామంలో 23 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరవగా.. మంగళవారం ఒక ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ కల్యాణ్ ప్రకాశ్, అనిల్, గణేశ్‌లు ఉన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

ఖానాపూర్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని కోరుతూ పట్టణంలోని విద్యానగర్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాపూర్ నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పరాంకుశం శ్రీనివాస్, సతీశ్, రాకేశ్, సురేశ్, రాజు, రాజేశ్వర్‌గౌడ్, భూమన్న, సుధాకర్ తదితరులు ఉన్నారు.

కుంటాల: వర్షాలు కురువాలని కోరుతూ మండలంలోని విఠాపూర్‌లో మంగళవారం రైతులు కప్పతల్లి ఆట ఆడారు. కొత్త బట్టలో కప్పలను ఉంచి రోకలి బండకు కట్టి, డప్పు,చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ముధోల్: వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ముధోల్‌లో మున్నూర్‌కాపు కాల్వ గల్లీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ముక్తాదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అన్నప్రసాదం , నైవేద్యాలను సమర్పించారు. నియోజకవర్గ మున్నూర్‌కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేశ్, బాలాజీ, లక్ష్మణ్, తదితరులున్నారు.

ఈరోజు

విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: 33/11 కేవీ విశ్వనాథ్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అధిక లోడు తగ్గించేందుకు 5 ఎంవీఏ కెపాసిటీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ ఏరియా, మోచిగల్లీ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, కబూతర్ కమాన్, బంగల్‌పేట్, నాయుడువాడ, బోయవాడ, రామ్‌రావుబాగ్, సాయిబాబా టెంపుల్ ఏరియా, విశ్వనాథ్‌పేట్, వైఎస్సార్ కాలనీ, గాజులపేట, డాక్టర్స్ లైన్, కావేరి నగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముధోల్ ఎమ్మెల్యే రాక

కుంటాల: మండలకేంద్రంలలోని రైతువేదికలో బుధవారం ఉదయం 11:30 గంటలకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరవుతారని తహసీల్దార్ కమల్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తానూరులో..

తానూరు: మండలకేంద్రంలోని రైతువేదికలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ లింగంమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఎమ్మెల్యే రామారావ్ పటేల్ హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందిస్తారని వెల్లడించారు.

అమ్మ పేరిట మొక్క నాటాలి



మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం సందర్భంగా మంగళవారం మొక్కల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలను బడిలో చేర్పించాలి

• డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని రత్నాపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల నమోదు వివరాలను హెచ్‌ఎం మాలతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు చెందిన 16 మంది గురుకుల పాఠశాలకు సెలెక్ట్ కావడంతో హెచ్‌ఎంను అభినందించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో ఉన్న సదుపాయాలను వివరించాలన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో వన మహోత్సవం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి వనమహోత్సవం నిర్వహిస్తున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వాటిని తీసుకెళ్లి పాఠశాలల్లో నాటాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలోని పాఠశాలలో మున్సిపల్ కార్యాలయాల నుంచి మొక్కలు తీసుకెళ్లాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జీపీఎస్ యాప్ ద్వారా ఫొటోలను డీఈవో కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి



బహుమతి అందజేస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా



ముధోల్‌లో మాట్లాడుతున్న సీఐ మల్లేశ్



లక్ష్మణచాందలో పోస్టర్లతో విద్యార్థులు, పోలీసులు

• ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌రూరల్: మండలంలోని కొండాపూర్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు మంగళవారం వివిధ పోటీలు నిర్వహించారు. ఏఎస్పీ రాజేశ్‌మీనా మాట్లాడారు. విద్యార్థులు, యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్ వాడొద్దన్నారు. డ్రగ్స్ నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సెల్ఫీలు దిగారు.

భైంసాటౌన్: యువత మత్తు పదార్థాలకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలని సీఐ జి.గోపినాథ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రెయిన్‌బో జూనియర్ కళా శాలలో మత్తు పదార్థాల నిర్మూలనకు అవగాహన కల్పించారు. ఎస్సై మహ్మద్ గౌసుద్దీన్, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లక్ష్మణచాంద పోలీసుల ఆధ్వర్యంలో సోన్ సీఐ గోవర్ధన్ మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాల గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1908కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇందులో ఎస్సై శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్‌ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు అశోక్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మత్తు పదార్థాల నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భైంసా పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్సై శంకర్, ఉపాధ్యాయులు, పోలీసులు, పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను ఎస్సై శ్రీకాంత్ వివరించారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే డయల్ 100, టోల్‌ఫ్రీ నెంబరు 1908, ఫోన్ నంబర్ 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు. హెచ్‌ఎం సాయన్న, ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ వినోద్, రవి, వినీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో డ్రగ్స్ వినియోగం అనర్థాలను విద్యార్థులకు ఎస్సై అశోక్ వివరించారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, శ్రీనివాస్, జానకీరాం, అశ్విని పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను ముధోల్ సీఐ మల్లేశ్ అవగాహన కల్పించారు. ఎస్సై బిట్ల పెర్సిస్, సిబ్బంది ఉన్నారు.

సోన్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిద్దులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి వివరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటించారు. సిద్దులకుంట పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం ఆరాధన, హరీశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లోటుపాట్లు గుర్తించేందుకే తనిఖీ



పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

పెంబి: ఉపాధిహామీ పథకంలో అవకతవకలు, లోటుపాట్లు గుర్తించేందుకు ప్రతి ఏడాది సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి డీఆర్డీవో నాగవర్ధన్ కుమార్ అన్నారు. మంగళవారం పెంబి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన 321 అభివృద్ధి పనుల డీఆర్‌పీల నివేదిక చదివి వినిపించారు. కూలీల వేతనాలు 6 కోట్ల 28 లక్షల 68 వేల 6 వందల 17 రూపాయలు, మెటీరియల్‌కు 85 లక్షల 64 వేల 140 రూపాయలు, మొత్తం మండలంలో 7 కోట్ల 14 లక్షల 32 వేల 757 రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. గ్రామపంచాయతీలో ఏడు రకాల రిజిస్టర్లు పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సుధాకర్, లక్ష్మన్, ఎంపీడీఓ రమాకాంత్, రాజశేఖర్, టీఏలు రాజన్న, గంగాధర్, నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

కడెంలో వర్షం

కడెం: మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. విత్తనాలు విత్తిన, సాగు పనులు చేపట్టేందుకు ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది.